# అందమైన మనసు



కారు దిగి డోర్ లాక్‌చేసి, కెమేరా భుజాన తగిలించుకుని, చేతిలో పూల సజ్జతో మెట్లు ఎక్కసాగింది కీర్తన. శ్రీనగర్‌కాలనీ-వెంకటేశ్వరుని దేవాలయం.

ధవళవస్త్రాలలో సాధారణమైన అలంకరణతో ఒక్కొక్కమెట్టు హుందాగా ఎక్కుతూ నడుస్తున్న ఆమె ఆలయప్రాంగణంలో అడుగు పెట్టింది.

సాయంసంధ్య వెలుగులో - నీరెండ ముఖంమీద పడుతుండగా గాలితో లేచిపోదామనుకుంటున్న ముంగురులను సాధ్యమైనంత మందలిస్తున్నట్టుగా సద్దుకుంటూ ఇంచుమించు నేలను జీరాడుతున్న చున్నీని పైకి లాక్కుంటూ నడుస్తున్న ఆమె భూలోకంలో వచ్చిన పని అయిపోయి దివికేగుతున్న సురకన్య మాదిరిగా వుంది.

గుండ్రని ముఖంలో ఎంతో తపస్సుచేసి వరాలు పొంది ఆయాస్థానాలను అలంకరించిన సుమబాలలన్నీ ఆమెలో దోబూచులాడుతున్నాయి. కలువరేకులు నయనాలుగా, సంపంగి నాసికగా, గులాబీలు పెదవులుగా, చెక్కిళ్ళు సింహాచలం సంపెంగలా, మిలమిల మెరిసే పలువరుస విరిసిన సన్నజాజుల మాలలా, నుదురు మొగలి పూరేకులా, మెడ పందిరి మల్లెమొగ్గలా ప్రకృతిలోని మత్తెక్కించే పూలన్నీ ఆమె ముఖ కమలంలో ప్రతిబింబిస్తున్నాయి.

గోదావరి పాయలా, అద్భుతశృంగార దేవతలా నడిచివస్తున్న ఆమెను చూసిన వెంటనే, ఎంతటి మగవాడి చూపు అయినా ఆమె పాపికొండల వక్షంపై ఎగిరెగిరి పడుతున్న కౌస్తుభహారంలో ఇరుక్కుపోయి గిలగిలలాడిపోవాల్సిందే.

అలా ఎంతోమందిని తనవైపు ఆకర్షించిన ఆమె తనవైపు కనీసం కన్నెత్తయినా చూడకుండా ప్రదక్షిణ చేస్తున్న ఆరడుగుల నిండైన మగవాడిని చూసి బిత్తరపోయింది.

అతను మామూలుగా లేడు. ఎత్తుకు తగ్గలావు, మగటిమిని ప్రదర్శిస్తున్న ఛాతీని, బంధించినలాల్చీలో, తెల్లని గ్లాస్కోపంచెలో సంప్రదాయబద్ధంగా 'మడి' కట్టుకున్న మగాడిలా చేతులు జోడించి నమస్కరించుకుంటూ నడుస్తున్నాడు. ఆ సమయంలో కుడివైపున ఉన్న కుచ్చిళ్ళు గాలికి ఒత్తిగిలి నిండైన అతని శరీర ఆకృతి మరింతగా చూడాలనిపించేలా, నిత్యమూ వ్యాయామంతో తీర్చిదిద్దిన దేహం

అప్పుడప్పుడు బయటకు తొంగిచూస్తోంది.

'వావ్! వాటె బ్యూటిఫుల్ పర్సనాలిటీ! పరిచయం చేసుకోవాల్సిందే!' అనుకుని రెండు ప్రదక్షిణాలు పూర్తిచేసి మూడవ ప్రదక్షిణ ప్రారంభించిన కీర్తన అతని వెనుక అడుగుదూరంలో నడక సాగించింది.

"ఆ జంట చూడముచ్చటగా ఎంత బాగుందో! భార్యాభర్తలంటే అలా ఉండాలి!" ఎక్కడో దూరంగా వినిపించిన మాటలకు ఆమె చెక్కిళ్లు ఎర్రబడ్డాయి.

అతను ప్రదక్షిణ పూర్తిచేసుకొని దైవ దర్శనానికి నిలబడ్డాడు. కీర్తన కూడా ప్రదక్షిణ పూర్తిచేసి వచ్చి అతని ఎదురుగా నిలబడింది కావాలనే. నమస్కరించుకుని కనులు తెరిచిన అతను వనదేవతలా తన ముందున్న కీర్తనను చూస్తూనే కాలి బొటనవేలు నుంచి నుదుటివరకు ఉన్న ఆమె సజీవచిత్రాన్ని అప్రయత్నంగానే మనసులో ముద్రించుకున్నాడు.

కనులు తెరచిన కీర్తనచూపుతో అతని చూపు రెండు క్షణాలు పోట్లాడి ఓడిపోయి, విడిపోయింది. అతను ప్రసాదం తీసుకుని, కోవెల గట్టుచివరకు వెళ్ళి కాళ్ళు నేలకానించి కూర్చున్నాడు. కీర్తన పూలసజ్జ అందుకుని అతనికి దగ్గరగా వచ్చి నిలబడి అడిగింది. "మీకు అభ్యంతరం లేకుంటే నేను ఇక్కడ కూర్చోవచ్చా?"

పిండి పనసతొనల్లాగా వున్న ఆమె మాటలు వింటూనే "ఊఁ!" ఉన్నాడతను.

"నాపేరు కీర్తన. పూర్తిపేరు సంకీర్తన"

"థ్యాంక్యూ! బైదిబై నాపేరు శ్రీ చైతన్య నేను ఎమ్.సి.ఎ. ఫైనలియర్. మరిమీరు?"

"నేను ఎమ్.బి.ఎ. ఫస్టియర్. మీరు ఉండేది?" అడిగింది సంకీర్తన.

"ఈ కాలనీలోనే! మరి మీరు..."

"పంజగుట్ట పార్కు ఎదురుగా."

"థ్యాంక్యూ! నేను వెళ్ళిరానా" అన్నాడు.

"అప్పుడేనా. నాకు...నాకు మీతో స్నేహం చేయాలని ఉంది!" అతను ఆమె స్వచ్ఛమైన తెల్లని కళ్ళలోకి ఒక్కసారి సూటిగా చూసి లేవబోయాడు.

ఆమె చనువుగా అతని చేయిపట్టి ఆపింది. తన రక్త కేశనాళికలలో 'కలవరం' మొదలైందని గ్రహించిన చైతన్య ఆమె చేతిని సున్నితంగా తప్పించాడు.

"మీరు నాకు సమాధానం చెప్పనేలేదు"

"కీర్తనగారూ! నాది నిర్మొహమాటంగా మాట్లాడే తత్త్వం. మీతో స్నేహం చేస్తే నాకు లాభం ఏమిటి?" అన్నాడతను.

"నిజమైన స్నేహం లాభం కోరుతుందా?" అమాయకంగా అడిగిన ఆమె ప్రశ్నలోని స్వచ్ఛతని గ్రహిస్తూ-

"మిస్ కీర్తనా! మీకు ఇందాకే చెప్పాను. నాది సూటిగా మాట్లేడేతత్వమని, ఇందాక కనులు తెరిచిన వెంటనే మీరు ఎదురుగా సాక్షాత్కరించేసరికి నాకింతటి అదృష్టమా అని ఎంతో మురిసిపోయాను. నాకు ఆడ-మగ స్నేహంమీద పరిపూర్ణమైన నమ్మకం లేదు." అన్నాడు.

బాణందెబ్బ తగిలిన లేడిలా చూసిందామె.

"ఎందుకని?"

"నాకు అందమయిన వాళ్లంటే భయం"

"ఏమైంది? ఎందుకు భయం" అడిగింది.

"నాస్వానుభవం ప్రకారం అందమైన వాళ్లకు అంత అందమైన మనసువుండదు. అందుకని!" అన్నాడు.

"ఎందుకు అలాంటి నిర్ణయానికి వచ్చారు?"

"మీకు నేను వివరించలేను. కానీ ఒక్కటి చెప్పగలను. అందమైన పూవుకు అంత అందమైన సువాసన ఉన్నప్పుడే ఆ పూవు జన్మ ధన్యమయ్యేది" అన్నాడు.

"నా గురించి ఏమీ తెలియకుండానే మీరలాంటి అభిప్రాయానికి రావడం అన్యాయం"

"మీరనాల్సింది ఆ మాటకాదు. మీరు నాతో నిష్కల్మషమైన స్నేహం చేస్తానని అనాలి. 'ఎట్టి పరిస్థితులలోనూ మన స్నేహం హద్దులు దాటదు.' అని మీరు నాకు మాట ఇస్తే మీతో స్నేహం చేయడానికి అభ్యంతరం లేదు. అలా అని నేను ప్రవరుడినో, ఋష్యశృంగుడినో అనుకోకండి. మనది స్నేహం మాత్రమే!" అన్నాడు చైతన్య.

"మీరు నిష్కర్షగా చెప్పారు కాబట్టి నేనూ అలాగే చెబుతాను. స్నేహాన్ని స్నేహం కోసమే తప్ప స్వార్థానికి వినియోగించను. సరేనా!"

"సరే! మరి మన స్నేహం మొదలైందని చెప్పడానికి సాక్ష్యం?" అన్నాడు చైతన్య.

"ఇదిగో ఇది" ఆమె కొబ్బరికాయ ముక్కతీసి అతని నోట్లో పెట్టింది. అతను కూడా అలాగే చేశాడు. అంతే. మరో అరగంటలో వారిద్దరూ అత్యంత ఆత్మీయులైపోయారు.

చైతన్య అడిగాడు ఆమెను.

"మీ ఇంట్లో అభ్యంతరం చెబితే!"

"చూడండి చైతన్యా! మాది చక్కటి సోషల్ ఫ్యామిలీ. నాన్నగారు నగరంలో పేరు మోసిన బిజినెస్ మేగ్నెట్. నేనొక్కగానొక్క కూతుర్ని. నేనంటే పంచప్రాణాలు. నా అంతట నేనుగా వచ్చి మీ స్నేహం కోరానంటేనే నాకున్న స్వేచ్ఛ మీకు అర్థమౌతోందనుకుంటాను. బైదిబై మీరు ఉంటున్నది ఈ కాలనీలోనే అన్నారు కదా! రూమ్‌లోనా?" అడిగింది కీర్తన.

"కాదు కీర్తనా. మా అంకుల్ వాళ్లింట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నా" చెప్పాడు.

"మరి నేను మిమ్మల్ని కలిసేదెలా?"

"నా సెల్ నంబరిస్తాను మరి మీరు?"

"నేనూ అంతే" విచిత్రంగా చేతులు త్రిప్పుతూ అన్న ఆమె భంగిమకు ఎర్రని చిగుళ్లు కనిపించేలా అందంగా నవ్విన చైతన్యను తదేకంగా చూస్తూ ఉండిపోయింది కీర్తన.

"మరి వెళ్దామా!" అన్నాడు చైతన్య.

"ఓ.కే." అంటూ లేచింది కీర్తన.

★★★

"హల్లో! చైతూ!"

"చైతన్య బాత్రూమ్‌లో ఉన్నాడమ్మా ఎవరు మీరు?" అడిగారు.

వెంటనే ఫోన్ కట్‌చేసి అరగంట తర్వాత చేసింది కీర్తన. "ఇందాక ఎవరు ఫోన్ రిసీవ్ చేసుకున్నది?"

"అంకుల్. గాళ్‌ఫ్రెండా?... అని అడిగారు. కాదు ఆడస్నేహితురాలు అని చెప్పాను"

"రెండింటికీ తేడా ఏంటి?"

"గాళ్‌ఫ్రెండ్ అంటే జలగమ్మ అని అర్థం. అంటే డబ్బుకోసం పీల్చి పిప్పిచేసి వదిలే రాక్షసి అని" అన్నాడతను.

"అమ్మో! అంత భయంకర నిర్వచనమా! అది సరేగానీ మీ సెల్ ఆయన దగ్గర ఎందుకు ఉంది?" అడిగింది.

"ఆయన సెల్‌నే నేను వాడుకుంటాను కాబట్టి. హి ఈజ్ఎ బ్యూటీఫుల్ గైడ్ అండ్ ఫ్రెండ్ ఫర్ మి" చెప్పాడు చైతన్య.

"అలాగా! అది సరేగానీ మన స్నేహం మొదలై నెల పూర్తయిన సందర్భంగా మీకొక మంచి బహుమతి ప్రజంట్ చేస్తాను. ఎక్కడికొస్తారు?" అన్నది కీర్తన.

"ఎక్కడకి రాను?" అడిగాడు చైతన్య.

"టైంపుల్‌కి వచ్చేస్తారా!" అన్నది కీర్తన.

"టెంపుల్‌కి అంటే నేను సాంప్రదాయ దుస్తుల్లోనే రావాలి! బిర్లా టెంపుల్‌కి వస్తాను" అన్నాడు చైతన్య.

"మళ్లీ ఇదేమిటి?" అడిగింది కీర్తన.

"స్వామి దర్శనం చేసుకోకుండా, మెట్లమీద కాసేపు కూర్చుని వచ్చేద్దాం సరేనా!" అన్నాడతను.

"సరే! అలాగే" అన్నది కీర్తన.

★★★

కళ్ళుమూసుకున్న అతని చేతుల్లో కవరు ఉంచింది కీర్తన. కళ్లు తెరచిన అతను కవరు తీసుకొని బాసింమఠం వేసుకొని కవరు తెరిచాడు. అందులోంచి ఆరుఫోటోలు బయటపడ్డాయి.

"వీడెవడు?" అనబోయి వాటిని పరికించి చూసి చిరుకోపంగా అడిగాడు.

"ఇవ్వెప్పుడు తీశారు కీర్తనా?"

"మీతో పరిచయం కాని క్రితం!" చెప్పింది కీర్తన.

"అంటే!" ఆశ్చర్యంగా అడిగాడు.

కీర్తన వివరంగా చెప్పింది. "ఆ రోజు మీరు మామూలు డ్రెస్సులో ఉంటే మిమ్మల్ని పట్టించుకునేదాన్నేకాదు. కానీ ఈ రోజుల్లో ఇంత ముద్దపప్పు కుర్రాడు ఎవరాఅని మిమ్మల్ని బాగా పరిశీలించాకనే మీ స్నేహం కోరింది".

"చాలా బాగున్నాయి. కీపిటప్" అంటూ వాటిని కవరులో పెట్టి ఆమెకిచ్చేశాడు.

"చైతూ! మీకింకో న్యూస్ చెప్పాలి!"

"చెప్పండి కీర్తి" అన్నాడు చైతన్య.

"నిన్న నాకు పెళ్లిచూపులు జరిగాయి"

"వావ్! కంగ్రాట్స్ కీర్తి. నా స్నేహితురాలు ఓ ఇంటిదౌతోందన్నమాట. హార్టీ కంగ్రాట్స్" అన్నాడు ఆమె చేతిని తన

చేతిలోకి తీసుకొని షేక్‌హేండ్ ఇస్తూ. సరిగ్గా ఆ సమయంలో అతని చేతిపై ఆమె కన్నీటి బొట్లు.

"కీర్తీ! ఏమిటిది?" అడిగాడు.

"ప్లీజ్! చైతు. రెండునిమిషాలు మీ భుజంమీద తలవాల్చి నన్ను ఏడ్వేయనీయండి" నిజాయితీగా ఆమె అడిగిన కోరికకు అతను బదులు మాట్లాడలేదు.

ఆమెకు ధైర్యం చెబుతున్నట్టుగా ఆమె భుజం తడుతూ ఉండిపోయాడు అతను.

అయిదు నిమిషాల తర్వాత తేరుకుంది.

"చెప్పండి కీర్తీ! మీరెందుకు బాధపడుతున్నారు. స్నేహితుడిగా మీకు నేనేం సాయం చేయగలను?" అడిగాడతను.

"తప్పకుండా చేస్తారా?" అడిగిందామె.

"మన ఒప్పందం ప్రకారమయితే ఖచ్చితంగా చేస్తాను" అన్నాడు చైతన్య.

"నిన్న నాకు జరిగినవి పెళ్లిచూపులే కాదు. ఎంగేజ్‌మెంట్ కూడా! అతనితో వారంరోజులు కన్యాకుమారి ట్రిప్ ఏర్పాటు చేశారు. మీరు కూడా వచ్చి ఈ వారం రోజులు అతన్ని పరిశీలించి మీరు ఔనంటేనే నేను అతన్ని వివాహం చేసుకుంటాను." అన్నది కీర్తన.

"తప్పకుండా కీర్తి! నేను రావడంవల్ల మీకు న్యాయం జరుగుతుందనిపిస్తే తప్పనిసరిగా వస్తాను. మరి నేనెలా రావాలి?"

"మీరు అక్కడ నన్ను కలిసినట్టుగా పలకరిస్తాను. నా క్లాస్‌మేట్ అంటాను. నా వుడ్‌బికి పరిచయం చేస్తాను".

"అతడు అందగాడేనా?" అడిగాడు.

"మీకన్నా కలర్ ఉంటాడు నిజానికి. ఆ అందంలో జీవంఉండదు. అందమైన మనసు కూడా లేదనిపించింది. అతని మాటలు వింటుంటే" అన్నది.

"నామాటలు నాకే అప్పగిస్తున్నారా కీర్తీ"

"నో మైడియర్ ఫ్రెండ్. సాటి మగాడిని మీరయితే త్వరగా అంచనా వేయగలరని" అన్నది సంకీర్తన.

"తప్పకుండా డియర్! తప్పకుండా" అంటూ ఆమెకు తన అంగీకారం తెలిపాడు చైతన్య.

★★★

కన్యాకుమారి-కేరళ గెస్ట్‌హౌస్.

తన రూమ్‌లోంచి బయటకు వస్తున్న శ్రీ చైతన్యను చూస్తూనే-

"హాయ్! చైతూ! మీరు... మీరు ఇక్కడ" అని ఆశ్చర్యపోతూ కౌగిలించుకున్నంత పనిచేసింది కీర్తన.

"నేను ఇక్కడకు హాలీడే ట్రిప్‌కు వచ్చాను. మరి మీరు" అన్నాడు ఆశ్చర్యం ప్రదర్శిస్తూ శ్రీచైతన్య.

"ఓ! అన్నట్టు చెప్పడంమరిచాను. హీ ఈజ్ మై వుడ్‌బి. శ్రీహర్ష. బైదిబై హరీ! ఈయన హైదరాబాద్‌లో నా క్లాస్‌మేట్ శ్రీచైతన్య" అంటూ శ్రీహర్షని పరిచయం చేసింది.

అయితే తను చైతన్య భుజంగుచ్చి పట్టుకునే పరిచయం ,చేయడం శ్రీహర్ష గమనించాడని అర్థం చేసుకుంది కీర్తన.

అందమైన ముఖానికి గంటు పెట్టుకున్నట్టుగా, చేతబడి చేయబడిన వాడిలా యాంత్రికంగా నవ్వాడు శ్రీ హర్ష. చైతన్యతో కరచాలనం చేస్తూనే.

"చైతూ!వై హబ్బీ ఈజె సోషల్ మూవింగ్ పర్సన్. విదేశాలన్నా పాశ్చాత్య సంగీతమన్నా ప్రాణమంటే నమ్మండి. అన్నట్టు మీరెక్కడికి బయల్దేరారు?"

"ముందు అమ్మవారి దర్శనం చేసుకొని ఆ తర్వాత వివేకానంద రాక్‌కు వెళ్దామని".

"ఓహ్!! వాట్ ఎ సర్‌ప్రైజ్! నిజంగా మా ప్రోగ్రాం కూడా ఇదే. కదూ హరీ!" అంది కీర్తన గోముగా.

"ఎస్.ఎస్. ప్లీజ్‌కమ్ వితజ్." అన్నాడు శ్రీహర్ష ఆ సమయంలో వేరే గత్యంతరంలేక.

"నోనో! మీరు కాబోయే భార్యాభర్తలు మీ ఇద్దరి మధ్య నేనెందుకు పానకంలో పుడకలాగ" అంటూ తప్పించుకోబోయాడు శ్రీచైతన్య.

"అదేంకుదరదు చైతూ. మేమిద్దరం ఇప్పటికే చాలా చాలా అర్థం అయ్యాం. ఇలాంటి ప్లేసెస్‌లో ఒక్కళ్ళే తిరిగితే ఏం ఎంజాయ్‌మెంట్ ఉంటుంది. కనుక మీరు మాతో వస్తున్నారు. అంతే" అన్నది కీర్తన.

నిస్సహాయంగా భుజాలెగరేస్తూ 'ఒకే' అని శ్రీ చైతన్య "వెల్‌కమ్" అంటూ ముందుకు నడిచాడు. ముందుగా కన్యా కుమారీ దేవి దర్శనం చేసుకున్నారు. అక్కడ నుంచి గాంధీ టూంబ్ (మెమోరియల్ బిల్డింగ్)ను చూశారు.

"ఈ మెమోరియల్ ప్రత్యేకత మీకు తెలుసా? శ్రీహర్షా" అడిగాడు శ్రీచైతన్య.

"తెలీదే!" అన్నాడతను.

"గాంధీ మహాత్ముని అంత్యక్రియల తరువాత ఆయన చితాభస్మాన్ని కలశాలలో ఉంచి మూడుచోట్ల భద్రపరిచారు. ఆ మూడింటిలో ఇది ఒకటి. ఈ హాల్లో తులసికోటలా వుంది చూశారూ. దానిమీద మహాత్మాగాంధీ జనన, మరణసమయాలు లిఖించబడి ఉన్నాయి. దీని ప్రత్యేకత ఏమిటంటే ఈ టూంబ్‌కు పైన ఒకే ఒక రంధ్రం ఉంది. మిగతా అంతా శ్లాబ్ చేసే శారు. సరిగ్గా అక్టోబరు రెండవతేదీ ఉదయం పదకొండు గంటల రెండు నిమిషాలకు ఆ ఒక్కరోజు మాత్రమే సూర్యరశ్మి ఆ రంధ్రం గుండా ఆ కోటపై పడుతుంది.

మిగతా ఏ రోజులోనూ కోటమీద పడదుగానీ, లోపల ఎక్కడైనా పడుతుంది. ఈ అద్భుతమైన ఏర్పాటు చేసిన ఇంజనీర్లను నిజంగా అభినందించాల్సిందే... ఏమంటారు కీర్తనా?" అన్నాడు శ్రీచైతన్య.

"మీరు చెప్పింది నిజమే చైతన్యా!" అంది కీర్తన.

అక్కడ నుండి కబుర్లు చెప్పుకుంటూ వివేకానంద రాక్ దగ్గరకు వెళ్ళే బోట్ సెంటర్‌కు వచ్చారు.

"మీరిద్దరూ మాట్లాడుతూ ఉండండి. నేను తినడానికి ఏమైనా తెస్తాను" అంటూ కీర్తన సమాధానం కోసం చూడకుండా ముందుకు సాగింది.

"మిస్టర్ శ్రీహర్ష! మీకు కీర్తన నచ్చిందా"

"చాలా! అదిసరేగానీ మీ ఇద్దరికీ ఎప్పటినుంచి పరిచయం? మీలాంటి ఫ్రెండ్ ఉన్నారని తను నాతో ఎప్పుడూ చెప్పలేదే!" అన్నాడు శ్రీహర్ష.

"ఇంటర్, డిగ్రీ కలిసి చదివాం! కాలేజీలో ఎన్నో ప్రోగ్రామ్స్‌లో జంటగా పాల్గొన్నాం. మీ హాబీస్?"

మనసులోని అప్రసన్నత ముఖంలో చొరబడకుండా ప్రయత్నిస్తున్న శ్రీహర్ష ఏడవలేక నవ్వుతున్నట్టు అన్నాడు.

"అందమైన వాటిని నా సొంతం చేసుకొని నలిపినలిపి పారేయడం అంటాననుకున్నారా! కాదు అబద్ధాలాడడం నా హాబీ" పకపకా నవ్వాడు శ్రీహర్ష.

"ఓహ్! వాటె గుడ్ జోక్!" మరింతగా శ్రీ చైతన్య నవ్వుతుండగా కీర్తన పల్లీలతో వచ్చింది.

"ఏమిటి! ఇంతలోనే అంత ఫ్రెండ్స్‌యిపోయారా. వెరీగుడ్, అదిగో బోట్ వచ్చేసింది. పదండి". అంటూ చంటిపిల్లలా పరుగులు తీసింది కీర్తన దూరంగా చిన్న కొండలా ఉన్న వివేకానంద రాక్ దగ్గరకు చేరుకోగానే "అమ్మో! ఎంత పెద్దదో!" ఆశ్చర్యంగా అంది. వివేకానంద రాక్‌మీద అన్నీ చూపించాడు శ్రీచైతన్య.

"స్వామీ వివేకానంద ప్రతీరోజూ ఈ హిందూ మహాసముద్రాన్ని ఈది ఇక్కడకు వచ్చి ధ్యానం చేసుకొని తిరిగివెళ్ళేవారట. దక్షిణాన మన భారత దేశానికి ఈ రాక్‌నే హద్దుగా నిర్ణయించారట. ఇది దాటితే శ్రీలంక ఏరియాలోకి మనం ప్రవేశించినట్టే" చెప్పాడు శ్రీ చైతన్య.

రాక్ మీద నున్న విశాలభవనంలోకి ప్రవేశించారు. అక్కడ స్వామీ వివేకానంద నిలువెత్తు విగ్రహం సజీవత్వాన్ని సంతరించుకుని ఠీవిగా నిలబడి ఉంది.

ఆ మందిరంలోనే శారదాదేవి, శ్రీరామకృష్ణ పరమహంసల నిలువెత్తు చిత్రపటాలు వారికి పునఃప్రాణప్రతిష్ఠ జరిగినంత దేదీప్యమానంగా ఉన్నాయి.

అవన్నీ చూసిన తరువాత ఆకుపచ్చని ఓంకారనాదం ఉన్న ఒక గదిలోకి ప్రవేశించారు.

అక్కడ ఎవరైనాసరే తమ ఇష్టదైవాన్ని మనస్ఫూర్తిగా కావలసినంతసేపు ధ్యానించుకుని బయటకు వెళ్లవచ్చు. ఆ నిశ్శబ్దంలో పరమాత్మ దర్శనం నిజంగానే అవుతుంది అన్నంత పవిత్రంగా ఉందా ధ్యానమందిరం.

అక్కడ నుంచి బయటకు వచ్చాక ఒక రాతిమీద అద్దాల అమరికమధ్య ఒకే ఒక శ్రీపాదముద్ర వుంది. కన్యాకుమారి శివుని పెళ్ళాడనెంచి అక్కడే ఒంటికాలిమీద తపస్సు చేసిందని భావిస్తారు. ఆ ప్రదేశాన్ని భక్తితో పూజిస్తారు.

ఈ వివరాలన్నీ చెప్పాక రాక్ చుట్టూ ఉన్న పై ప్రదేశానికి చేరుకొన్నారు ముగ్గురూ.

అక్కడ రాతిమీద ఏ నెలలో సూర్యుడు ఏదిశగా ఉదయించేదీ, ఎన్ని డిగ్రీల కోణంలో ఉదయించేదీ, చిత్రించబడి ఉంది. చుట్టూ రెయిలింగ్ ఏర్పాటు చేయబడి ఉంది ఇనుప ఊచలతో.

"ఇలాంటి ప్రదేశంలో ఆత్మహత్య చేసుకొంటే ఎంత బాగుంటుందో కదూ కీర్తనా! ఓహ్ వాటి బ్యూటీఫుల్‌సీన్ రా కీర్తనా!" అంటూ రైలింగ్ దాటి ఒక కాలు ముందుకు వేసి కీర్తన చెయ్యి పుచ్చుకొని లాగాడు. శ్రీహర్ష.

మరుక్షణం చైతన్య ఆమెని బలంగా వెనక్కి లాగడమే కాదు. శ్రీహర్ష జబ్బపుచ్చుకుని కూడా వెనక్కులాగకపోయి ఉంటే అతడు సముద్రంలోపడిపోయి ఉండేవాడు.

విపరీతమైన భయానికి లోనైనకీర్తన శ్రీచైతన్యను కరుచుకుపోయి బలంగా హత్తుకు పోయింది సన్నగా కంపిస్తూ.

"డోన్ట్‌ఫియర్!మైడియర్!ప్లీజ్‌రిలాక్స్, ప్లీజ్!" ఆమెను కుదిపి చెంపలుతట్టి వెన్నునిమిరి అయిదు నిముషాలలో మామూలు మనిషిని చేశాడు శ్రీచైతన్య.

"ఐయామ్‌రియల్లీసారీ!"విస్ఫత్తువగా అన్నాడు శ్రీహర్ష.

★★★

పాలగ్లాసుతో గదిలోకి అడుగుపెట్టింది కీర్తన. ఆమె రాకకోసం కోటి తారకల మధ్య వెలుగొందుతున్నపున్నమి చంద్రుడిలా పూల దండలమధ్య పానుపుపై మెరిసిపోతున్న శ్రీచైతన్య ఆమె చేయి పట్టుకుని ఒక్కసారిగా దగ్గరకులాక్కున్నాడు. ఆమె చుబుకం పట్టి పైకెత్తాడు.

ఆమె కనులకొలనులు ఒక్కక్షణం రెపరెపలాడాయి.

"చైతూ! నువ్వు లేకపోతే నేను ఏమైఉండేదాన్ని!"

"కీర్తి! మై లవ్! నిన్ను చూసిన తొలినాడే నా జీవిత భాగస్వామిగా నిన్ను నా మనసులో ముద్రించుకున్నాను. అయితే ఇంత అందం వెనుక అంత అందమైన మనసు వుండి అందులో నాకు మాత్రమే స్థానం ఉంటే ఈ ప్రపంచమేకాదు సమస్తలోకాలు జయించినంత ఆనందం! మరి నీ తప్పిపోయిన పెళ్లికొడుకు నాకంటే అందగాడే. అయితే మాత్రం అతనో మానిక్‌డిసీజ్డ్ ఫెలో. నా అంచనా కరెక్టే అయితే అతని జీవితంలో సంతృప్తి అన్న పదమే ఉండదు. అటువంటి దర్టీఫెలో.

మనం 'సెల్'లో మాట్లాడుకుని అనుకున్నది అనుకున్నట్టుగా జరిగేలా చూసుకున్నాం కాబట్టి సరిపోయింది. లేకపోతే ఈ పాటికి నువ్వు అతనితో!..." అన్నాడు మార్దవంగా శ్రీచైతన్య.

"ఛీ... ఇటువంటి సమయంలో ఆ దుష్టుడి పేరు ఎత్తవద్దు చైతూ. ఆ క్షణం తలుచుకుంటేనే నాకింకా ఒళ్ళు గగుర్పొడుస్తోంది. ఎంత భయంకరం! నాన్నగారు నా అభిప్రాయానికి విలువిచ్చి అతనికి అందమైన

మనసుంటేనే చేసుకోవడానికి పర్మిషన్ ఇచ్చారు కాబట్టి సరిపోయింది. లేకపోతేనా..." అంటూ ఆగింది.

"ఊఁ.. లేకపోతే!" అన్నాడు చైతన్య.

"ఈ పాటికి చచ్చిపోయి ఉండేదాన్ని!" అన్నది సంకీర్తన.

"అబ్బా! మనకంత సీనుందా!" అన్నాడు పకపకానవ్వి ఆమె బుగ్గ అందుకుని సన్నగా కొరికి.

కీర్తన కూడా అలాగే చేసింది.

"చూడు మిస్టర్! ఈకాలం ఆడపిల్లలు దేంట్లోనూ తక్కువకాదు. చూస్తావా నా తడాఖా!" అంది కీర్తన.

"సరే! నేనిలాగే పడుకుంటాను. నువ్వు ఏం చెయ్యగలవో చూస్తాను" అన్నాడతను అందమైన పలువరుస కనిపించేలా నవ్వుతూ తలక్రిందచేతులు పెట్టుకుని.

"మరి నేను ఏం చేసినా కాదన కూడదు. సరేనా!"

"చూడమ్మాయ్! నీకు ఫిఫ్టీ పర్సంట్ వరకూ ఛాన్సు ఉంది. అది దాటితే మాత్రం మగవాడిగా నేను చేతులు కట్టుకొని చూస్తూ ఊరుకోనుగా!" అన్నాడతను.

"చూద్దామా!" అతను ఆమెకు కన్నుగొట్టాడు.

రహస్యంగా వారి చర్యలుగమనిస్తున్న ఆ గదిలోని ప్రతీవస్తువు తమ జన్మ ధన్యమైనట్టు ప్రతిధ్వని చేస్తుంటే అలసి నలిగిన సుమమాలలు మాత్రం ఆ "అందమైన మనసుల" స్వచ్ఛతను తమలో నింపుకుని పవిత్రపూజకు అంకితమైనట్టు ఆ మంచం మీద నక్షత్రాలలా మెరుస్తూనే ఉన్నాయి. ●

'స్వాతి సపరి వారపత్రిక'
16-08-2002